# తీర్పు

"ఈ తగువులింక నే తీర్చలేను–" అంటూ, ఒక వీశ బరువుగల పదార్థమేదో విసిరిపోయింది – సుందర రామయ్య భార్య. అది తిన్నగా వచ్చి సుందరరామయ్య ఒడిలో పడింది.

ఒడిలో పడ్డ బరువుకేసి కుతూహలంగా చూసిన సుందరరామయ్యకు అందమైన అట్టలు అయిదు కనిపించేయి.

అవి అయిదూ పిల్లలు పరీక్షల్లో వాడుకునే రైటింగ్ పేడ్సు. అందులో నాలుగు, ఒక్కే పోలికను పుట్టిన అన్నదమ్ముల్లా ఉన్నాయి, ఒక్కటి మాత్రం విలక్షణమైంది. దానిసైజు తక్కిన వాటికన్నా కాస్త పెద్దది. దానిమీద వేసిన కాగితం అందమైనదేకాక ఖరీదైనది కూడ. పైగా దానికి కేలికోతో చేసిన కార్నర్ పోకెట్లున్నాయి.

సుందరరామయ్యకి నలుగురు మగపిల్లలున్నారు. కడగొట్టుది ఓ ఆడపిల్ల, పెద్దవాళ్ళు ముగ్గురూ హైస్కూలుకు పోతున్నారు.

తలెత్తి చూసిన సుందరరామయ్యకి ద్వారం దగ్గర పిల్లల్లో చిన్న వాళ్ళిద్దరూ కనిపించేరు. ప్రశాంతంగా ఉన్న తండ్రి మొహం చూసేక వాళ్ళిద్దరూ లోపలికొచ్చారు. తండ్రి ప్రశ్నించగా కూతురు ప్రారంభించింది. కొడుకు పూర్తిచేసేడు.

రెండో అన్నయ్యకి బళ్ళో అట్టలు చేయడం నేర్పేరు. అలాంటివి బళ్ళో చేసి అమ్మేరు. ఒక్కొక్కటి ముప్పై నయాపైసల కమ్మేరు. పెద్దన్నయ్య అర్ధ రూపాయి ఖర్చుతో అరడజను చేయవచ్చని కనిపెట్టేడు. బజారులో ఆ అట్టలే ఒక్కొక్కటి ఆరణాలని చెపితే అమ్మ అర్ధరూపాయి యిచ్చింది. ఉన్నవాళ్ళు ఐదుగురే కాబట్టి అయిదు అట్టలే చేసుకుందామన్నారు. మిగిలిన డబ్బు – ఒక అట్టమీద అధికంగా పెడితే అది అందమయిన కాలికో అట్ట అయింది.

తాను పెద్దవాడు కాబట్టి, తనది పెద్దక్లాసు కాబట్టి, ఆ అట్ట తాను తీసుకుంటానన్నాడు పెద్దన్నయ్య. అలా వల్లకాదు నేను తీసుకుంటానన్నాడు రెండో అన్నయ్య – అమ్మ మొదట పెద్దన్నయ్యకే యిచ్చేయమంది. రెండో అన్నయ్య వాదిస్తే వాడికే ఇచ్చేయబోయింది. తగువు తెగక పోవడం వల్ల తండ్రి దగ్గరకు వచ్చింది.

సుందరరామయ్య తెలివికి అది ఒక పెద్ద సమస్య కాదు. అయినా, అతడు కొంచెంసేపు వెనకా ముందూ ఆలోచించేడు.

పెద్దకొడుక్కి సుందరరామయ్య తండ్రి పేరు పెట్టేరు. అందుచేత వాడంటే అతనికి పక్షపాతమని పిల్లల మధ్య ఓ అభిప్రాయముంది.

రెండోవాడికి తల్లి తండ్రి పేరు పెట్టేరు. కాబట్టి, వాడంటే తల్లికి ముద్దని – భర్త పోయి నిస్సంతయి ఇంటజేరిన ఆడబడుచు – సుందరరామయ్య అప్పగారు – అంటుంది.

పిల్లలూ, పెద్దలూ యిలా పక్షాలుగా విడగొట్టబడ్డం సుందరరామయ్య కిష్టమైన విషయం కాదు. తన పిల్లలు, త్రేతాయుగం నాటి శ్రీరామచంద్ర సోదరులను తలపిస్తూ, ఒక్కటిగా ఉండాలని అతని అభిమతం.

అందుచేతనే అతను యిందులో తొందర పనికి రాదనుకున్నాడు. ఆలోచించి –

"అన్నయ్యల నందర్నీ తీసుకురా!"

–అని కొడుకుని పంపేడు.

వాడు వెళ్ళేక, "అమ్మను కూడా తీసుకురా" అని కూతుర్ని పంపేడు.

పెద్దవాడు – తెల్లగా, నాజూగ్గా, స్టయిలుగా ఉంటాడు. కళ్ళల్లో కొంత తెలివి కూడా కనపడుతుంది. వాడిని చూస్తే నీళ్ళు పోసి పెంచుతున్న గున్నమామిడి మొక్కలా ఉంటాడు.

చిన్నవాడు – కాస్త బండగా ఉంటాడు. తెలియని వాళ్ళకి అన్నకన్నా వాడే పెద్దవాడనిపిస్తాడు. మూసి ఉంచే పెదవుల్లో పట్టుదలా, తెరచి ఉంచే కళ్ళల్లో నిబ్బరం కనిపిస్తాయి. చూసేవాళ్ళకి, వాడితో కొంచం జాగ్రత్తగా ఉండడం మంచిదనిపిస్తుంది.

సుందరరామయ్య చూపులకి – పెద్ద కొడుకులో దెబ్బతిన్న అభిమానం, దాన్ని దాచుకోడానికి పడే శ్రమా కనిపించేయి. వాడి నిలబడే పద్ధతిలో స్థిరత్వం లేదు. వాడి నవ్వులో నిండుదనం లేదు. కాని వాడిలో ఎక్కడో భరోసా కొంత మిగిలే ఉంది.

రెండోవాడు పళ్ళూ, కళ్ళూ, దవడలూ, వెనక్కి ముడిచిన చేతులూ అన్నీ బిగించుకొని – దేవాలయ స్తంభాల మీద కొంచెం వెనక్కి జారబడి ఉండే బొమ్మలా – స్థిరంగా నించొని ఉన్నాడు. గోడకానుకొని ఉండే ఆ బొమ్మల మూపు మీద సాధారణంగా ఏదో బరువుంటుంది. వీడి వీపు మీద బరువేదీ ఉన్నట్టు కనిపించదు. ముఖం మాత్రం కందగడ్డలా ఉంది.

వాడు ప్రతిదానికీ యిట్టే సీరియస్ అయిపోయే రకమని సుందరరామయ్య అంతకుముందే వాడిని గురించి ఒక అభిప్రాయం ఏర్పరచుకున్నాడు. తక్కిన పిల్లలంతా తమాషా చూస్తున్నట్టూ, ఏం జరుగుతుందో చూదాంవని, తలా ఓమూలా నిలబడ్డారు. సుందరరామయ్య భార్య తలుపు దగ్గరుంది. ఆమె మూతి బిడాయించుకుని గంభీరంగా ఉంది.

సుందరరామయ్య ఆ వరసలో అప్పగారి వంక చూడలేదు. చిన్నప్పుడు తమ పుట్టింట్లో వారాల అబ్బాయే, యివాళ తను హాజరైన కోర్టులో జడ్జీగా కనిపించినట్టు – ఆ అప్పగారు, ఆ తమ్ముడి వంక ధీమాగా చూస్తోంది.

సుందరరామయ్య కొంచెంసేపలా అందరి వంకా చూసి, చిరునవ్వు నవ్వుతూ, రెండో కొడుకు ముఖంలోకి చూసీ చూడనట్లు చూస్తూ యిలా అన్నాడు.

"సరే, ముందు మీ అభిప్రాయాలన్నీ వరసగా చెప్పండి. ఆ తరువాత నే చెప్పవలిసింది చెప్తాను".

ఎవరూ మాట్లాడలేదు.

సుందరరామయ్య మొదట పెద్దకొడుకుని మాట్లాడమందామనుకున్నాడు. మళ్ళా మనసు మార్చుకొని ఆఖరు పిల్లతో ప్రారంభిద్దామనుకొన్నాడు.

ఆర్డర్ జారీచేసేక విచారణ సబబుగా ప్రారంభమయ్యిందనిపించింది.

అందరికన్నా చిన్నది – నిజంగా చిన్నది. అది కొంచంసేపు నసిగింది, తరవాత నవ్వింది: తరవాత సిగ్గుపడింది. ఆ తరవాత అక్కడ నుంచి పారిపోయింది.

ఆఖరి పిల్లవాడు అలా కాకుండా చెప్పేడు. ఉన్న అందర్లోనూ తానే చిన్నవాడు కాబట్టి తను ముందు ఎంచుకోవాలన్నాడు.

"నువ్వెలా చిన్నవాడివయ్యావ్? నీకన్నా చిన్నది చెల్లి ఉంది. అలా అయితే ఆ అట్ట దానికి పోతుంది".

"చెల్లి ఒకటో కలాసేగా! దానికెందుకు?"

"నువు మూడో కలాసేగా నీకు మాత్రమెందుకు?"

"నాకు వచ్చే ఏడాదికి పనికొస్తుంది".

సుందరరామయ్య తన నాల్గవ కొడుకు కూడా తెలివైన వాడిలా కనిపించగా చూసి లోలోపల సంతోషించాడు.

మూడోవాడు అంతకన్నా కూడా చక్కగా వాదించేడు.

అన్నయ్యలిద్దరూ పెద్దవాళ్ళు. వాళ్ళు తలచుకుంటే, ఇంకొకటి మంచిది చేసుకోగలరు. తమ్ముడూ, చెల్లీ చిన్నవాళ్ళు – వాళ్ళకి దాని ఉపయోగం అట్టే వుండదు. కాబట్టి, తనకది రావడం న్యాయమన్నాడు. కాక పెద్దవాళ్ళిద్దర్లో ఒకరికి వెళ్ళాలంటే, అది రెండవ వాడికివ్వడం న్యాయమన్నాడు. తనకి ఏ అట్ట ఇచ్చినా ఫరవా లేదన్నాడు. ఎందుచేతంటే తను వాటిని చెయ్యలేదు. తాను పేస్టు రాసేడు. కాని అది ఒక పెద్ద పని కాదని ఒప్పేసుకున్నాడు.

రెండవ కొడుకు అతి ముక్తసరిగా–

"అన్నయ్య ఐడియా యిచ్చేడు. అమ్మ దబ్బిచ్చింది. అవన్నీ చేసింది నేను, అంతే నేను చెప్పవలసేది' అన్నాడు.

"నాకా అట్టమీద మోజేమీ లేదు. తను చేసినంత మాత్రాన దానిమీద హక్కల్లా తనదే అయిపోయినట్టు వాడు మాట్లాడితే నాకు చిర్రెత్తుకొచ్చి, నాకే రావాలన్నా నా అట్ట. అసలలా చెయ్యవచ్చునీ, చేద్దామనీ ఐడియా యివ్వడమేకాక అమ్మను ఒప్పించి దబ్బిప్పించింది నేను" అన్నాడు పెద్దవాడు.

"అమ్మ ఎవరడిగినా దబ్బిస్తుంది. బజారుకెళ్ళి అవన్నీ తెచ్చిన వాడు చిన్నన్నయ్య. అవన్నీ చేసిన వాడూ వాడే. అందుచేత వాడికే వెళ్తుంది అట్ట" మూడవ వాడు.

"పెద్దన్నయ్య ఐడియా ఇవ్వకపోతే అసలీ అట్టలే ఇప్పుడు తయారయేవి కాదు".

"ఒత్తి ఐడియాలకి అట్టలు ఎప్పటికీ పుట్టవ్".

సుందరరామయ్య జడ్జీగారి పెదబాబులాగ "ఆర్డర్! ఆర్డర్!!" అని అరిచేడు.

అందరూ ఊరుకున్నాక అతను అట్టల వంక చూస్తూ, పెదవులపై చిరుహాసంతో ఆలోచనలో పడ్డాడు.

ఎందుచేతనో భార్యవీ అప్పగారివీ ఉద్దేశాలు తెలుసుకునే ఆలోచన మానుకున్నాడు.

తన్నడగందే మాట్లాడడం భార్యకు అలవాటు కాదు. తన్నడగకపోయినా తన సలహాలిచ్చేయడం ఆడబడుచు కలవాటు.

అయినా ఆవిడ కొంచెం సేపు ఆగి చూసింది. ఇక సుందరరామయ్య ఏదో అనేశేటట్టున్నాడనగా ఆవిడ నోరు విప్పింది. మాటాడే ముందు ఇటూ అటూ చూడ్డం ఆవిడకి అలవాటు – తల ముందుకు పెట్టడం కూడా ఆవిడకి అలవాటు.

"ఒరే, నే చెపుతా వినూ అది – న్యా...యంగా–"

"పెద్ద మేనల్లుడికిచ్చేయడం ధర్మం" రెండో వాడు పూర్తిచేసేడు.

వాడి గొంతువిన్నాక, అంతకన్న వాడి ముఖం చూసేక, సుందరరామయ్య ఆలోచనలు నిలిచిపోయేయి. అతడు కొడుకు కళ్ళలోకి లోతుగా చూస్తే అడిగేడు–

"ఎందుచేతట?"

"ఇంటికి పెద్దవాడు కదా– ఎప్పటికైనా – మీ తరువాత..."

సుందరరామయ్య ముఖంకేసి ఎవరూ చూడ్డం లేదు.

"అవునురా! పెద్దవాడన్నాక పెద్దవాడే. వాడి తరువాతే మీరంతా. ముందు పెద్దవాడెంచుకోవడమే సబువు" అంది మేనత్త.

చిన్నవాడిలోని మనిషిలో మనిషి – తమాషా అయినవాడు. వాడు మేనత్త ముఖంలోకి చూస్తూ వుంటే, గొలుసున కట్టిన జాగిలం ముందరి కురుకుతూ మొరగడం కనిపించింది.

సుందరరామయ్య భార్య ఆడబడుచు దబాయింపు విని ఊరుకోలేక పోయింది.

"మీరు సబువులూ, లోకాచారాలూ మాటాడితే పెద్దవాడి వంతు వాటా వేయడం – చిన్నవాళ్ళు ఎత్తుకోవడం రివాజు" అంది.

ఒక వంక మేనత్త ఏదో మాటాడుతూనే వుంది–

"అలా అయితే, నేనే ముందెంచుకోవాలి" అంటున్నాడు నాలుగోవాడు.

"కాదు, చెల్లీ" అన్నాడు మూడోవాడు.

సుందరరామయ్యకి కొడుకులకు లభించిన, లభిస్తున్న లోకజ్ఞానం చూస్తూ చిరాకు పుట్టినట్టుంది.

"మీరంతా ఒక్కసారి ఊరుకోండి!" పెద్దవాళ్ళనుద్దేశించి చిన్నవాళ్ళతో అన్నాడు.

పెద్దా చిన్నా అందరూ ఊరుకున్నారు.

– సుందరరామయ్యకి ఆ ఐడియా బాగానే ఉన్నదనిపించింది.

"అదే బాగుంది. ముందు ఆఖరువాడు ఎత్తుకుంటాడు".

"వాడెత్తుకున్నాడు – సాదా అట్ట తీసుకున్నాడు" అన్నాడు రెండోవాడు.

వాడి కళ్ళల్లో చదరంగం ఆడే ఆసామి "ఆటకట్టు –" ఎత్తు వేసేక చూసే చూపు కనిపించింది.

"అది కేన్సిల్, ఇప్పుడెత్తుకుంటాను మళ్ళీ. అప్పుడు నాకు తెలిసింది కాదు. ఇచ్చేయండి. నాకా కేలికో అట్ట యిచ్చేయండి" అంటూ పెద్దన్న వంక – కోటల్ని జయించి వచ్చిన సైన్యాధిపతులు రాజుల వంక చూసే చూపులు – చూస్తూ ముందుకు వచ్చేడు ఆఖరివాడు.

''ఆగు!'' అన్నాడు చిన్నబ్బాయి. ''ఆ పద్ధతి బొడ్డుంబాలయితే అది కొసవరకూ బొడ్డుం బాలే?"

ఆఖరివాడు ఆగిపోయేడు.

''అంతా నీ యిష్టవే నేమిత్రా'' అన్నది మేనత్త రెండోవాడితో.

రెండోవాడు జవాబివ్వకుండా తండ్రి ముఖంలోకి చూసేడు. సుందరరామయ్యకి తప్పింది కాదు.

"నువ్వు పో" అన్నాడు ఆఖరివాణ్ణి.

"ప్చ్! ఏం చేస్తాం?" అన్నట్టు పెదవ్విరిచి, నవ్వుకొంటూ వెళ్ళిపోయేడు వాడు. వాడు సినలైన కర్మయోగిలా ప్రవర్తించినట్టు ఎవళ్ళూ గుర్తించినట్టు లేదు.

పెద్దవాడి మొహంలోకి ఉడికింపు చూపులు చూస్తూ మూడోవాడు నవ్వాడు. అది తండ్రి సమక్షం కాకపోతే వాడి వీపు చిట్లకుండేదా అని వాడికే అనుమానం వేసింది.

సుందరరామయ్యకు క్రమంగా చిరాకు ప్రారంభమయ్యింది. అతని బుద్ధి పరిపరివిధాల పోతోంది. లాటరీ వేసేస్తే అనుకున్నాడో సారి. "అట్టలెవరివీ కావని దాచేస్తే?" అనుకున్నాడింకోసారి. "అంతకన్నా అవన్నీ చింపి పారేస్తే పీడ వదులుతుంది" అనొచ్చు భార్య. పోనీ యింకో అట్ట అలాటిదే చేస్తే! దానికన్నా మంచి అట్ట తను స్వయంగా చేసి పెద్దవాడికిస్తే – ఆడపిల్ల కదా అని ఆడపిల్లకిచ్చేయడం ఆడదాని వ్యవహార మనిపించింది సుందరరామయ్యకి.

"అసలు ఒక అట్ట వేరే ఎందుకు చేసేరూ?"

"ఆ ఐడియా కూడా అన్నయ్యే యిచ్చాడు".

"చిన్నన్నయ్య అన్నీ ఒకలాటివే చేసుకుందామన్నాడు".

"అప్పుడల్లా ఎవరమో ఒకరం తీసుకుందామన్నాడు".

సుందరరామయ్యకి ఎటుపోయినా ఓటమి ఎదురవడం చిరాకును పెంచుతోంది. అతను ఆలోచిస్తున్నాడు. ఆలోచనకు తెగని సమస్యలున్నాయంటే అతను నమ్మడు.

ఈలోగా తక్కిన వాళ్ళంతా వాదిస్తున్నారు.

తల్చుకుంటే అలాంటివి పది చెయ్యగలమంటున్నాడు నాలుగోవాడు. అయితే ఎందుకు చేసుకోలేదంటు న్నాడు మూడోవాడు. "చేసుకుంటాం చూడవోయ్" అంటున్నాడు నాలుగోవాడు. "ఏమిటి పేడేనా?" అంటున్నాడు మూడు. "మనకు చేతనయ్యేదదే!" – నాల్గు. "కనపడుతూనే ఉంది!" – మూడు.

రెండో రంగంలో మేనత్త మరదల్ని పట్టుకొని దులుపుతోంది.

రెండోవాడికి చిన్నంతరంవూ, పెద్దంతరంవూ లేదంటుంది. ఇవాళ అన్ననయింది. రేపు తండ్రిని కాదంటాడు. వాడు చెడిపోవడం తప్పదంది. వాడు పొరుక్కి ఉపకారమంటే పొయ్యార్పుకునే రకమది. పొరుగు పచ్చోర్వ లేని వారు బాగు పడరంది. ఈ జన్మలో పెట్టిపుట్టని వారికి ఏ జన్మలోనూ పుట్టదు. అది ఖాయం అంది.

ఒకరికిచ్చేటప్పుడు మంచిదిచ్చి, తానుంచుకునేది పుచ్చుదుంచుకోవడం పుణ్యం చేసుకునే వారి బుద్ధంది. పాపం చేస్తే పాపం; పుణ్యం చేస్తే పుణ్యం తప్ప యింకేదీ తమ వెంట రాదంది.

"– ఒక్క అట్టలు తప్ప" అన్నాడు రెండోవాడు. వాడి గొంతు విలక్షణంగా వినబడింది.

అందరూ మాటాలాపి వాడి వంక చూస్తున్నారు.

వాడు నేరుగా తండ్రి దగ్గరకు వెళ్ళి అతని ఒడిలోని అట్టలన్నీ తీసుకున్నాడు."అత్తా! నేనీ అట్టలు పంచుతాను చూడు. అన్నయ్య ఆరేసి అణాలన్నాడు. కాని బజారులో ఇవి

ఒక్కొక్కటి పావలాయే! అమ్మ యిచ్చిన అర్ధరూపాయికి ఇదిగో రెండు అట్టలు. అన్నయ్య ఐడియాకి ఈ పావలా అట్ట ఎక్కువ. తమ్ముడు చేసిన సాయం చాలా తక్కువే! అయినా, నాకు రెండున్నాయి అందుచేత తమ్ముడికొకటిచ్చేస్తు న్నాను. కాబట్టి, ఈ అట్టంటే నాకు యిష్టంగా ఉంది కాబట్టి, ఈకేలికో అట్ట నాది".అని, అక్కణ్ణుంచి వెళ్ళిపోతూ అల్లంత దూరం వెళ్ళి అక్కడ ఆగి అత్త వంకే తిరిగి మళ్ళీ అన్నాడు. వాడి పెదవులు ఎంత ఆపుకున్నా ఆగక వణుకుతున్నాయి. అలా వణకడం వాడికి ఏమాత్రం కూడా యిష్టం లేదు. వాడికి వెంట వెంటనే సరియైన మాటలు స్ఫురణకు రావడం లేదు. అందుక్కూడా వాడికి, వాడిమీద కోపం వస్తోంది."మొదట అన్నయ్యని పంచమన్నాం. వాడికి పంచడానికి చేతులు రాలేదు. అమ్మకు పంచడం యిష్టమే అయినా ఆమెకు చేతనయింది కాదు. చేతనయ్యీ నాన్నగారు ఎందుచేతో వెనకా ముందు ఆలోచిస్తున్నారు. నువ్వైతే, అడక్కుండానే పంచటానికి వచ్చేవు. కాని, "పంచిన వాళ్ళు పాపానపోతా"రని సామెత నువ్వే మొన్న చెప్పేవుకదా?; నువ్వు పెద్ద దానివి. నిన్ను నరకానికి పంపడం నాకిష్టం లేదు. అందుచేత ఆ పాపమేదో నేనే మూటకట్టుకుంటున్నాను".

ఇలా చెప్పి వీధి గదిలోకి వెళ్ళిపోయేడు.

అంతా నిశ్శబ్దం. అందరూ బొమ్మల్లా చూస్తున్నారు.

"చూశావురా, వీడి అఘాయిత్యం!" అన్న ఆడబడుచు ఆక్రోశం చెవినిపడగా సుందరరామయ్య భార్య, ఆమె వంక చూసి అటునుండి భర్త వంక తిరిగింది.

సుందరరామయ్య ఎర్రగా, చాలా ఎర్రగా జేవురించిన ముఖాన్ని ఆవలివంక తిప్పేసుకున్నాడు. ★

*(యువ, మార్చి 1964)*